# ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి కృష్ణారావు





2 లో


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





గురువారం, మార్చి 19, 2026 పేజీలు: 8


## ‘బ్యానర్ కత్తిరింపు కాదు... ఇది కక్ష రాజకీయాల కత్తి!”

-బ్యానర్ల భయం.. ప్రతిపక్షాలపై కక్ష.?
-మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ వ్యవహారంపై బీఆర్ఎస్ ఆగ్రహం”
-ఉగాది--రంజాన్ హోర్డింగ్స్‌పై బ్యానర్ల తొలగింపు వివాదం
- అధికార దుర్వినియోగమేనన్న అనుమానాలు..!

మహబూబ్‌నగర్, మార్చి 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రతిపక్షాలపై కాంగ్రెస్ పార్టీ చూపుతున్న ఓర్వలేని వైఖరి, కక్ష సాధింపు చర్యలు మరోసారి వెలుగులోకి వచ్చినట్టు బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో

-మిగతా 2లో..

### గ్యాస్ వినియోగదారులు నిబంధనలు

## పాటించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల మార్చి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి):** గృహ అవసరాలకు గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకునే వినియోగదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గ్యాస్ సిలిండర్ల కొరత,బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు అంటూ కొన్ని మీడియాల్లో వస్తున్న వార్తల నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర,ధనుష్ హెచ్.పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గ్యాస్ సిలిండర్ల సరఫరా పై అక్కడి యాజమాన్యంతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ బుకింగ్,సరఫరా ప్రక్రియలో ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు.గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం ప్రతి సిలిండర్ బుకింగ్‌కు

-మిగతా 2లో..

### ఏటీసీ భవన నిర్మాణా

## స్థల పరిశీలన

- ఏటీసీకి అనువైన భూమి కేటాయింపుకు అధికారులకు ఆదేశాలు
- కొండారెడ్డిపల్లిలో ప్రభుత్వ భూమి పరిశీలించిన కలెక్టర్



2 లో

## రుణాల వేగం పెంచండి



-పథకాల ఫలాలు ప్రజలకు చేరాలి”
- జిల్లా బ్యాంకర్లకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు
- లక్ష్య సాధనలో అలసత్వంపై అసంతృప్తి

2 లో

# 'బ్యానర్ కత్తిరింపు కాదు... ఇది కక్ష రాజకీయాల కత్తి!"

ఏర్పాటు చేసిన హోర్డింగ్స్‌పై ఉన్న పార్టీ బ్యానర్లను లక్ష్యంగా చేసుకుని తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తీవ్రంగా విమర్శించారు.
మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పట్టణ అధ్యక్షుడు శివరాజ్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యానర్లు తొలగించడం వెనుక రాజకీయ కక్ష స్పష్టంగా కనిపిస్తోందన్నారు. హోర్డింగ్ నిర్వాహకులకు డిప్యూటీ మేయర్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ రామాంజుల రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి పీఏ పేరుతో ఫోన్లు చేసి బ్యానర్లు తొలగించాలని ఒత్తిడి తెచ్చినట్టు ఆరోపించారు.
బ్యానర్లు తొలగించకపోతే ఇతర బ్యానర్లు కూడా అనుమతించబోమని, హోర్డింగ్స్ తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కార్పొరేషన్ అధికారులు ప్రత్యక్షంగా ఉండి బ్యానర్లు తొలగించడం దారుణమని, ఇది అధికార దుర్వినియోగానికి నిదర్శనమని మండిపడ్డారు. పండుగల సందర్భంగా అభిమానంతో, స్వంత ఖర్చులతో ఏర్పాటు చేసిన బ్యానర్లను టార్గెట్ చేయడం వెనుక రాజకీయ అసహనం దాగి ఉందని విమర్శించారు. "మీ ముగ్గురి బ్యానర్లు మాత్రమే ఉండాలా..? ఇతర పార్టీలకు స్థానం లేదా?" అని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు కొనసాగితే ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత మరింత పెరుగుతుందని హెచ్చరించిన బీఆర్ఎస్ నాయకులు, వెంటనే ఈ విధమైన కక్షపూరిత చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## రుణాల వేగం పెంచండి

మహబూబ్‌నగర్, మార్చి 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జిల్లాలో పేదరిక నిర్మూలన, సంక్షేమం, స్వయం ఉపాధి పథకాల అమలుకు బ్యాంకర్లు ఉదారంగా రుణాలు అందించి అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల కన్సల్టేటివ్ కమిటీ, డీఎల్ఆర్సీ సమావేశంలో ఆమె బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.
2025 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు మూడవ త్రైమాసికానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళిక అమలు పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ?10,565.61 కోట్ల లక్ష్యానికి గాను బ్యాంకులు ?7,056.80 కోట్ల రుణాలు విడుదల చేసి 66.79 శాతం సాధించినట్టు వెల్లడించారు. లక్ష్యానికి తగ్గ స్థాయిలో రుణాల పంపిణీ జరగడం పట్ల కొందరు బ్యాంకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో వివిధ పథకాల కింద వచ్చిన దరఖాస్తులు, మంజూరైనవి, పెండింగ్, తిరస్కరణ వివరాలను బ్యాంకర్లు, శాఖల అధికారులతో చర్చించారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు , వ్యవసాయం, స్వయం ఉపాధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల పథకాల కింద పెండింగ్‌లో ఉన్న రుణాలను వెంటనే విడుదల చేయాలని సూచించారు.
ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో 222 శాతం లక్ష్య సాధన చేసినందుకు పరిశ్రమల శాఖను అభినందించిన కలెక్టర్, విశ్వకర్మ పథకాల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల స్థితిని అభ్యర్థులకు తెలియజేయాలని సూచించారు.

బ్యాంకులు తమ లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడం అత్యంత ముఖ్యమని పేర్కొన్న కలెక్టర్, శాఖల మధ్య సమన్వయం పెంచుకుని సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. మత్స్యకార సహకార సంఘం, పశుసంవర్ధక శాఖ, డీఆర్డీఏ తదితర శాఖల పథకాల అమలుపై కూడా సమీక్ష నిర్వహించారు.
దరఖాస్తులను ఆమోదించడం, తిరస్కరించడం లేదా పెండింగ్‌లో ఉంచడానికి గల కారణాలను బ్యాంకర్లు స్పష్టంగా తెలియజేయాలని, తద్వారా లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించవచ్చని తెలిపారు.

నాబార్డ్ ఋుణ అంచనాలు విడుదల
2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా ప్రాధాన్యతా రంగాలకు నాబార్డ్ రూపొందించిన పోటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ ప్లాన్ ప్రకారం మొత్తం ?9024.36 కోట్ల అంచనాలు నిర్ణయించారు. ఇందులో పంట రుణాలు ?2816.02 కోట్లు, వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు ?2361.52 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలకు ?591.42 కోట్లు, ఎంఎస్ ఏం ఈ రంగానికి ?2467 కోట్లు కేటాయించారు. ఈ
సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, నాబార్డ్ డీడీఎం షణ్ముఖ చారి, ఎల్‌డీఎం చంద్రశేఖర్, పరిశ్రమల శాఖ జీఎం యాదయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగదారులు నిబంధనలు పాటించాలి

మధ్య 45 రోజుల గ్యాప్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.ఈ గడువు పూర్తికాకముందు మళ్లీ బుకింగ్ చేయడానికి ప్రయత్నిస్తే ఓటిపి నంబర్ రాదని,కాబట్టి ప్రజలు అనవసరంగా గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్దకు రావద్దని సూచించారు.గృహ అవసరాలకు గ్యాస్ బుకింగ్ సంబంధించి గతంలో వచ్చిన మెసేజ్లో ఉన్న తదుపరి బుకింగ్ తేదీ చూసుకుని ఆ తేదీకి మాత్రమే బుకింగ్ చేయాలని,గ్యాస్ బుక్ చేసిన వారికి సంబంధిత గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది నిర్దేశిత సమయంలోగా వినియోగదారుల ఇంటి వద్దకే వచ్చి సిలిండర్లను సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్ద గందరగోళం నివారించేందుకు ఓటిపి వచ్చిన వారికి ఒక లైన్ ఏర్పాటు చేసి సిలిండర్లను సరఫరా చేయాలన్నారు.అలాగే ఓటిపి రాని వారికి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ప్రతి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలన్నారు.ఈ హెల్ప్ డెస్క్ వద్ద వినియోగదారులకు బుకింగ్ స్టేటస్,ఓటిపి సమాచారం,తదుపరి బుకింగ్ తేదీ, తదితర వివరాలను అందించాలన్నారు.గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి నిర్దేశిత గ్యాస్ బుక్ లోని కన్స్యూమర్ నెంబర్ తో రిజిస్టర్ అయిన మొబైల్ నెంబర్ నుంచే వినియోగదారులకు ఓటిపి వస్తుందని,మొబైల్ నెంబర్ మార్పులు అనుమతించబడవని తెలిపారు.ఇది బ్లాక్ మార్కెటింగ్ నివారణ కోసం తీసుకున్న చర్యగా పేర్కొన్నారు.ప్రతి గ్యాస్ సిలిండర్‌కు ప్రత్యేక సీరియల్ నెంబర్ ఉంటుందని,సిలిండర్ దుర్వినియోగం లేదా ఇతరులకు మళ్లింపు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సంబంధిత వినియోగదారుడు మళ్లీ గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్నప్పుడు డెలివరీ సమయంలో ఇదివరకు ఇచ్చిన సిలిండర్ ను నంబర్ సరిచూసుకుని గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకునే వారిపై అవసరమైతే పోలీస్ కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జోగులాంబ గద్వాల జిల్లాలో 11 ఏజెన్సీల పరిధిలో గృహ అవసరాలకు సంబంధించి 1,76,366,వాణిజ్య అవసరాలకు సంబంధించి 907 గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు.ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 2815 గృహ అవసరాల గ్యాస్ బుకింగ్ లు జరుగుతున్నట్లు చెప్పారు.జిల్లాకు రోజుకు సుమారు 5000 గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని, గ్యాస్ కొరత ఎక్కడా లేదని స్పష్టం చేశారు.ప్రజలు భవిష్యత్తులో గ్యాస్ కొరత రావచ్చేమోనని అనుమానాలతో ముందుగానే బుక్ చేసుకోవడం వలన ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు సిలిండర్ల కోసం బారులు తీరాల్సి వస్తుందని పేర్కొన్నారు.వినియోగదారులు అపోహలను వీడి అనవసరంగా భయపడకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయంలోనే గ్యాస్ సిలిండర్ ల కోసం బుకింగ్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు.గ్యాస్ సిలిండర్ల బుకింగ్ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలు,గ్రామ పంచాయతీ కార్యాలయాలు,ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో సమగ్ర వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా వినియోగదారులకు ప్రతి రోజు గ్యాస్ సిలిండర్ల సరఫరా,బుకింగ్స్,ఫిర్యాదులపై నివేదికలు సమర్పించాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ నది అగ్రహారం వద్ద ఉన్న ధనుష్ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ గోదామును సందర్శించారు. కేజీబీవీలు,గురుకులాలు,పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్,ఆయా గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులున్నారు.

## ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి కృష్ణారావు

### సంప్రదాయాల సంరక్షణతో అభివృద్ధి సాధిద్దాం

గద్వాల మార్చి 18(ప్రజా జ్యోతి):ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు'శ్రీ పరాభవ'నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఉగాది మన వారసత్వపు పండుగ అని పేర్కొంటూ, పండుగలు,ఆచార వ్యవహారాలు,సంస్కృతి,సాంప్రదాయాలు,కళలు జాతిని సజీవంగా నిలుపుతాయని అన్నారు.వ్యవసాయ సంవత్సరారంభంగా భావించే ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలు చేకూర్చాలని మంత్రి ఆకాంక్షించారు.సమృద్ధిగా పంటలు పండుతూ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రకృతితో మమేకమై వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల్లో పరస్పర సహకారం,ప్రేమాభిమానాలతో సబ్బండ వర్ణాలందరూ పాల్గొనే గొప్ప పండుగగా ఉగాదిని అభివర్ణించారు.ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు.రైతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు.వ్యవసాయ రంగ అభివృద్ధితో అనుబంధ రంగాలు,వృత్తులు బలపడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమైందని పేర్కొన్నారు.జీవితం కష్టసుఖాల సమ్మేళనమని, ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలోని అనుభవాలను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలని సూచించారు.'శ్రీ పరాభవ'నామ సంవత్సరంలో తెలంగాణతో పాటు దేశం మరింత అభివృద్ధి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

## ఏటీసీ భవన నిర్మాణా స్థల పరిశీలన

అచ్చంపేట మార్చ్ 18 (ప్రజా జ్యోతి )
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో ఏటీసీ ఏర్పాటు కోసం అనువుగా ఉన్న భూమిని ప్రత్యక్షంగా సందర్శించిన కలెక్టర్, స్థల పరిమాణం, చేరుకునే మార్గాలు, మౌలిక వసతుల లభ్యత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను భూమికి సంబంధించిన రికార్డులు, యాజమాన్య వివరాలు, అందుబాటులో ఉన్న విస్తీర్ణం వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని ఖరారు చేయడంలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మార్గదర్శకాలను తక్షణమే విడుదల చేయాలని వంగూర్ తహసిల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణానికి కావలసిన ప్రభుత్వ భూమి ఎంపిక విషయంలో ఏటీసీకి చెందిన సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని పరిపాలనా అనుమతులను త్వరగా పూర్తిచేయాలని, ఫైళ్లను ఆలస్యం చేయకుండా ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఏటీసీ భవన నిర్మాణ పనులు త్వరలో
ప్రారంభమయ్యేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులు, సాంకేతిక సిబ్బంది, నిర్మాణ సంస్థల ఎంపిక వంటి అంశాలనుసమయానుకూలంగా పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ద్వారా ప్రాంతీయ యువతకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడంతో పాటు డిజిటల్, టెక్నికల్ రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించే అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. దీనివల్ల యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు స్థానిక ఆర్థిక అభివృద్ధికి కూడా ఇది తోడ్పడుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపల్, మండల తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి





## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మార్చి 18(ప్రజా జ్యోతి ప్రతినిధి):
జిల్లాలో పదో తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులకు ఆదేశించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల, ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించి,పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించిన కలెక్టర్,పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు, మౌలిక వసతులను కూడా పరిశీలించారు.పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లను అనుమతించరాదని స్పష్టం చేశారు.ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు.ప్రతి పరీక్షా కేంద్రంలో క్లాక్ రూమ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రశ్నపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తోనే కేంద్రాలకు తరలించి,పరీక్ష అనంతరం పోస్టాఫీసులో డిపాజిట్ చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని,వేసవి తీవ్రత దృష్ట్యా అస్వస్థతకు గురైన విద్యార్థులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ఓఆర్ఎస్,అత్యవసర మందులు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ ఉషారాణి,శివశంకర్ ప్రసాద్,సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చుక్కాయిపల్లి మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి కొరకు 6.50 కోట్ల రూపాయలను మంజూరు

## మంత్రి జూపల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గ్రామ ప్రజలు



కొల్లాపూర్ మార్చి 18 ప్రజా జ్యోతి
కొల్లాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా చుక్కాయిపల్లి మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధికి గ్రామ ప్రజల వినతి మేరకు టూరిజం శాఖ నుండి 6.50 ఆరు కోట్ల యాభై లక్షలఉ రూపాయల మంజూరు చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు గారి నిర్ణయాన్ని హర్షిస్తూ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజలు మంత్రి జూపల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరంఅభివృద్ధిలో వెనకబడిన గ్రామం మాది అని మంత్రికి వివరించగా మంత్రి జూపల్లి కృష్ణారావు గారి చొరవతో మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి ద్వారా కొత్త పుంతలు తొక్కుతుందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో చుక్కాయిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మంత్రి జూపల్లి అనుచరులు,యువకులు,మరియు గ్రామ పెద్దలు తదితరులున్నారు.

# గూడెంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

## -పశువుల ఆరోగ్య రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు



చిన్నంబావి, మార్చి 18 (ప్రజా జ్యోతి)
చిన్నంబావి మండలం, గూడెం గ్రామంలో ఉచిత గాలికూంటూ వ్యాధినివారణ టీకాల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం మార్చి 10 నుంచి ఏప్రిల్ 9 వరకు కొనసాగుతుందని పశు వైద్య సిబ్బంది తెలిపారు.గ్రామాల్లో రెండు రోజులపాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రతి పశువుకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు ఏటా రెండుసార్లు, ప్రతి ఆరు నెలలకు ఒకసారి టీకాలు వేయించడం తప్పనిసరి అని సూచించారు.వ్యాధి లక్షణాలు గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత 104ఫీఫ్ నుంచి 106ఫీఫ్ వరకు పెరిగి, నోటి నుంచి చొంగ కారడం, కాళ్లలో పుండ్లు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీంతో పశువులు మేత మేయలేక, నడవలేక నీరసిస్తాయి. పాడి పశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది.జాగ్రత్తలు తప్పనిసరి
వ్యాధి సోకిన పశువులను వేరుచేసి, పుండ్లను పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రపరచాలని, నోటి పుండ్లపై బోరో గ్లిజరిన్ రాయాలని సూచించారు. వెంటనే సమీప పశువైద్యుడిని సంప్రదించాలని తెలిపారు.ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పశువులకు తగిన నీరు, మేత అందించాలని, పాకాలను పరిశుభ్రంగా ఉంచాలని రైతులకు సూచించారు.రైతులకు అవగాహనగాలికుంటు వ్యాధి సోకిన పశువుల పాలను మనుషులు లేదా దూడలు త్రాగితే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. అందువల్ల ముందుగానే టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధిని నివారించుకోవాలని పశువైద్య సిబ్బంది రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ గంగరాజు, ఓఎస్ రాజు, జీఎం మద్దిలేటి, జీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## -లైంగిక వేధింపులకు పోక్సో చట్టం అడ్డుకట్ట

## -డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య




నాగర్ కర్నూల్ : మార్చ్ 18 ప్రజా జ్యోతి
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం నాగర్ కర్నూల్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ మరియు సెక్రెటరీ ఆదేశాల మేరకు చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం గురించి అవగాహన కల్పించడానికి లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని ప్రిసం హై స్కూల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీ రామ్ ఆర్య హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన బాలల హక్కుల గురించి వివరిస్తూ బాల బాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలకు వచ్చి చదువుకోవాలి ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని ఫోన్లో వచ్చిన మెసేజ్ లకు గాని వీడియోలను ఇతరులకు ఫార్వర్డ్ చేయడం వాటికి రిప్లై ఇవ్వడం చేయరాదని,విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండాలని తల్లిదండ్రులను,ఉపాధ్యాయులను గౌరవిస్తూ ఉన్నత స్థితిని పొందాలన్నారు.ముఖ్యంగా మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు ఫోక్సో చట్టం అడ్డుకట్ట వేస్తుందని అమ్మాయిలు తమకు ఏ విధమైన సమస్యలున్నా షీ టీం కు గాని,చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కు గాని సమాచారం ఇవ్వాలని,ఉచిత న్యాయ సహాయం కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి లబ్ధి పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ కానుకను అందించిన మాజీ కౌన్సిలర్ మేకల శిరీష యాదవ్









కొల్లాపూర్ మార్చి 18 ప్రజా జ్యోతి
కొల్లాపూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోపవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం కానుకగా అందించే రంజాన్ తోఫా కానుకను రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు గారి ఆదేశానుసారంతో మాజీ 12వ. వార్డు కౌన్సిలర్ మేకల శిరీష యాదవ్ గారు మరియు, 12వ. వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మేకల కిషోర్ యాదవ్ ఇంటింటికి తిరుగుతూ ముస్లిం సోదరులకు రంజాన్ పండగ సందర్భంగా ప్రభుత్వం అందించిన కానుకను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఈ రంజాన్ పండుగ వేళ ప్రతి ముస్లిం ఇంట్లో ఆనందాల వెల్లువ కలగాలని అందరూ కూడా ఆర్థికంగా ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని కోరుకుంటూ రంజాన్ పండుగను ముస్లిం సోదరులు అందరూ కూడా ఆత్మీయతతో జరపాలని కోరుతూ ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మేకల నాగరాజు,మేకల రమేష్ యాదవ్.మోహన్ ఖదీర్, పాల్గొన్నారు.

4

# ఈ నెల 27న,గోవా విహార యాత్రకు స్పెషల్ బస్సు

నాగర్ కర్నూల్ : మార్చ్ 18ప్రజా జ్యోతి
నాగర్ కర్నూల్ పట్టణ మరియు పరిసర గ్రామాల ప్రజలకు నాగర్ కర్నూల్ ఆర్టీసీడిపో ఆధ్వర్యంలో ఈ నెల 27న, ప్రత్యేక లగ్జరీ బస్సును ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# కేజీబీవీ సిబ్బంది విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి

## -విద్యా సంచాలకులు యం. సోమిరెడ్డి

**నాగర్ కర్నూల్ : మార్చ్ 18ప్రజా జ్యోతి**



కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు) విద్యార్థుల సమగ్ర విద్యా అభివృద్ధి కేంద్రాలుగా ఉన్నాయని ఈ సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు,సిబ్బంది ఆదర్శంగా నిలిచివిద్యార్థులకు నాణ్యమైన విద్యతో,పౌష్టికాహారాన్ని అందించడంలో బాధ్యతతో వ్యవహరించి,విద్యా అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర ప్రాంతీయ విద్యా సంచాలకులు హైదరాబాద్ (ఆర్జేడీ) ఎం. సోమిరెడ్డి అన్నారు.బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మిక తనఖీచేశారు.ఈ తనఖీ సందర్భంగా విద్యాలయంలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు,బోధన విధానం,ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాలను పరిశీలించివిద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి అభ్యాసస్థాయి,అవగాహన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు.అదేవిధంగా విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలను,వసతులను పరిశీలించి,ఆహారంనాణ్యత,పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత ఎస్.ఓ,సిబ్బందిని ఆదేశించారు.విద్యార్థుల ఆరోగ్యం,భద్రత,విద్యా భివృద్ధి పట్ల ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు.కేజీబీవీల్లో పని చేసే ప్రతి ఒక్కరూ వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని విద్యాసంస్థలకు చెడ్డ పేరు రాకుండా సమన్వయంతో పనిచేసి వ్యక్తిగతవిభేదాలను వీడి సంస్థ ప్రతిష్టను కాపాడాలని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి కేజీబీవీలను రాష్ట్రంలో ఉత్తమ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.ప్రభుత్వం కేజీబీవీ ల ద్వారా బాలికల సమగ్ర అభివృద్ధికి సమృద్ధిగా నిధులు వెచ్చిస్తుందన ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.కేజీబీవీలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల పై సమగ్ర విచారణ జరిపారు.ఆయన వెంట జిసిడిఓ శోభారాణి,కేజీబీవీ ఎస్.ఓ సుజాత ఉన్నారు.

# చిన్నంబావి మండలంలో తాలూకా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

**-మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి చేత ప్రారంభం**
**-క్రీడాకారుల్లో ఉత్సాహం నింపిన హర్షవర్ధన్ రెడ్డి**
**-రూ.30,000 మొదటి బహుమతి, రూ.15,000 రెండవ బహుమతి**

**చిన్నంబావి , మార్చి 18 (ప్రజా జ్యోతి)**





ఉగాది పండుగను పురస్కరించుకొని చిన్నంబావి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.కార్యక్రమానికి విచ్చేసిన హర్షవర్ధన్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మండల మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణమ్మ ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల ప్రజలతో గ్రామస్తులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఆయన,చౌరస్తాలోని డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.తదుపరి కబడ్డీ మైదానానికి చేరుకున్న ఆయన టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో కరచాలనం చేస్తూ వారిని ప్రోత్సహించారు. స్వయంగా కబడ్డీ ఆడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించారు.ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ యువతకు విద్య ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల ఐక్యత, అన్యోన్యత పెరుగుతాయని అన్నారు. తాలూకా స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదిగి కొల్లాపూర్ నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు.ఈ పోటీలు మార్చి 18 నుంచి 20 వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.విజేతలకు మొదటి బహుమతిగా రూ.30,000 నగదు మరియు షీల్డ్, రెండవ బహుమతిగా రూ.15,000 నగదు మరియు షీల్డ్ అందజేయనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నరేందర్ రెడ్డి, పుష్పలత, రామన్ గౌడ్, ఈదన్న, శ్రీధర్ రెడ్డి, చిన్నారెడ్డి, రంజిత్ కుమార్, ఉగ్ర నరసింహ, పరిమళ ప్రకాష్, డేగ శేఖర్, ఆర్ఎంపీ కృష్ణ, బ్రహ్మం, శివారెడ్డి, శంకర్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ సీట్ పొందిన విద్యార్థి ఎండి ఆసిఫ్‌కు సన్మానం

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్. మండల కేంద్రంలోని డాఫోడీల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 5 వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆరవ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన నవోదయ ఎంట్రన్స్ పరీక్షల లో 100 మార్కులకు గాను95 మార్కులు సాధించి ఆల్ ఇండియా 13వ ర్యాంకు సాధించి ఉమ్మడిమహబూబ్ నగర్ జిల్లాలోని వట్టెం నవోదయ పాఠశాలకు ఎంపికైన విద్యార్థి ఎండి ఆసిఫ్ ను మండల విద్యాధికారి నరసింహ బుధవారం శాలువతో సన్మానించి తీపి జ్ఞాపకార్థం మేమెంటో అందజేసి అభినందించారు. మారుమూల ప్రాంతంలో విద్యనభ్యసిస్తూ ఆల్ ఇండియా ర్యాంకు సాధించిన విద్యార్థి ఆసిఫ్ ను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి భవిష్యత్తులో కాంపిటీషన్ పరీక్షలో సక్సెస్ కావాలని సూచించారు. అంతేకాకుండా విద్యార్థి ఆసిఫ్ ఆల్ ఇండియా సైనిక్ ఎంట్రెన్స్ లో కూడా 300 మార్కులకు గాను 256 మార్కులు సాధించడం సంతోషకరమన్నారు.విద్యార్థి ప్రతిభకు సహకరించిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి. రాముడు ఉపాధ్యాయ బృందం వెంకటేష్ , ఆంజనేయులు,లక్ష్మి, మాసుంబి,సుచిత, దీపిక, రాధ, నిహారిక, ఆఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.



## పాలిటెక్నిక్ క్రీడల్లో సత్తా చాటిన ఆర్లగడ్డ వైష్ణవి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 18 (ప్రజాజ్యోతి):**



కేరళ రాష్ట్రంలోని కోలం జిల్లాలో నిర్వహించిన అంతర్ పాలిటెక్నిక్ క్రీడల్లో వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఆర్లగడ్డ వైష్ణవి ప్రతిభ కనబరిచింది. కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న వైష్ణవి చెస్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించి కళాశాలకు గౌరవం తీసుకొచ్చింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఆమెను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకే కాకుండా వనపర్తి ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కోటకొండలో ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు




**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 18( ప్రజా జ్యోతి)**

నారాయణపేట కోటకొండ గ్రామంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి, ఎం ఈ ఓ బాలాజీ , మాట్లాడుతూ ఎలాంటి మాస్ కాఫీ కు అవకాశం లేకుండా పోలీస్ భద్రతతో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా ప్రశాంతమైన వాతావరణం కల్పించడం జరిగిందని అన్నారు, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన ఒక సూపర్వైజర్ ఇద్దరు ఆశ వర్కర్లు ను మందులను ముందు జాగ్రత్తగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు, కానిస్టేబుల్ రాజు, ఆనందం, సూపర్వైజర్ లక్ష్మి, ఆశ వర్కర్లు అంజమ్మ జయ, ఉన్నారు

## 25 నిరుపేద కుటుంబాలకు రంజాన్ తోఫా






నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్ (18 ప్రజా జ్యోతి) నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో రంజాన్ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద ముస్లిం సోదరులకు ఇచ్చే రంజాన్ తుఫాను కోటకొండ జామ మసీదులో 25 నిరుపేద కుటుంబాలకు అందజేశారు జామా మసీద్ సదర్ పీర్ మైనుద్దీన్ సెక్రటరీ ఇస్మాయిల్, వార్డు మెంబర్ పేరపళ్ళ రఫీ, సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇంకా చాలామంది పేదలు ఉన్నారు కానీ ప్రభుత్వం తక్కువ ఇవ్వడంతో రంజాన్ తోఫా ఇవ్వడంతో తక్కువ మందికే ఇవ్వడం జరిగిందని మిగతా వారికి ఎమ్మెల్యే గారితో ప్రభుత్వం దగ్గర మాట్లాడి వచ్చే విధంగా ప్రయత్నిస్తామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు, కార్యక్రమంలో జామా మసీద్ కమిటీ సభ్యులు యువకులు పెద్దలు మహిళలు ఉన్నారు

# జోహార్ కామ్రేడ్ బాలాపీరు.

**నమ్మిన సిద్ధాంతం కోసం చివరికి ఉన్న కామ్రేడ్ బాలాపీరు.**


**భౌతికాయాన్ని వనపర్తి మెడికల్ కాలేజీకి అప్పగింత.**

**సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్**



**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

మండల పరిధిలోని బొల్లారం గ్రామానికి చెందిన కామ్రేడ్ బాలాపీరు (83) అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి చనిపోవడం జరిగింది. ఈ సందర్భంగా వారి భౌతికాయానికి సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్, డి బాల్ రెడ్డి, ఎం రాజు, జిల్లా నాయకులు ఎం కృష్ణయ్య, ఆర్ మౌలాలి. కామ్రేడ్ బాల పేరు కుమారుడు కృష్ణ ప్రసాద్, పార్టీ గ్రామ, మండల నాయకులతో కలిసి ఎర్రబట్ట, ఎర్రజెండా పూలదండ వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్ మాట్లాడుతూ షుమారుగా యాబై ఏండ్ల క్రితము బొల్లారం గ్రామములో సిపిఎం పార్టీ స్థాపించడము జరిగింది,ప్రారంభ రోజుల్లో పార్టీలోకి వచ్చిన కార్యకర్తల్లో కామ్రేడ్ కావలి బాలాపీరు ఒకరు చదువు సంధ్యలు లేకున్నా మంచి చొరవ తెలివితేటలు గలవారు బాలాపీరు ఎర్రజెండా పార్టీ అన్నా పార్టీ నాయకత్వము అన్నా ఆచంచలమైన నమ్మకము విశ్వాసము కనపరిచేవారు ఈనాటి కార్లు మోటార్లు లేని ఆకాలములో మైల్ల తరబడి అర్ధరాత్రి అపరాత్రి అనకుండా నడిచి పార్టీకోసము పాటుబడ్డ రోజులను మరచిపోలేము ఏది ఏమైనప్పటికి తాము పట్టిన కొమ్ము గెలవాలన్నా పట్టుదల వారిజీవిత కాలమంతా కొనసాగిందనే చెప్పాలి ఈ ఐదు దశబ్దాల కాలములో బొల్లారము లోని కమ్యూనిష్టు ఉద్యమము అనేక అగ్ని పరీక్ష లను ఆటుపోట్లను ఎదుర్కొని నిలవాల్సి వచ్చింది ఒకానొక సందర్భములో పార్టీ కార్యకర్తలు గ్రామము విడిచి చెలుకల్లో గుట్టల్లో ఉండాల్సివచ్చింది దాదాపుగా వందమంది జైల్లో ఉండాల్సిన పరిస్థితి వచ్చింది వీటన్నిటిలోనూ బాలాపీరు తనదైనట్టి ముఖ్యమైన పాత్రను నిర్వహించినాడు, చావు అంచుల్లో ఉండికూడా మొన్నజరిగిన పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకోసము హైదరాబాద్ నుండి వచ్చి బండిపై పడుకొని ఓటు వేసిన వేయించిన అతని మరియు అతని కుటుంబ సభ్యుల దీక్ష పట్టుదలను ఏమని మనము చెప్పగలము ఈ రోజుల్లో ఊర్లో ఉండికూడా తామున్న పార్టీకి తాము ఓటు వేయలేని వారిని చూస్తున్నాము తరాల మధ్య వస్తున్న అంతరాలను పోకడలను చూస్తుంటే ఈ తరము ప్రయాణము ఎక్కడికి చేరుకుం టుందో తన జీవిత కాలానంత పీడిత తాడిత ప్రజలకోసము సమాజములో ఒక మంచి మార్పుకోసం కృషి చేసిన కామ్రేడ్ బాలాపీరు. తను చనిపోయిన తర్వాత కూడా తన బతికాయాన్ని కుటుంబ సభ్యులు అందరూ కలిసి పార్టీ నాయకులతో కలిసి వనపర్తి మెడికల్ కాలేజీ కి భౌతికయాన్ని అప్పజెప్పడం జరిగింది. మెడికల్ కాలేజీ భౌతికాయాన్ని ఇవ్వడాన్ని పార్టీ శ్రేణులు అందరు కూడా హర్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్, డి బాల్ రెడ్డి, ఎం రాజు. సోషల్ మీడియా నాయకులు శంకర్, మండల నాయకులు ఎం కృష్ణయ్య, ఆరు మౌలాలి, ఆశన్న, ఖాజా హుస్సేన్, దేవేందర్, శ్రీనివాసులు, కాకం ఆంజనేయులు, వి కృష్ణయ్య,బాల గౌడ్, వెంకటస్వామి, తిరుపతయ్య,శివ, శంకర్, కుటుంబ సభ్యులు కృష్ణ ప్రసాద్, చిట్టెమ్మ బంధుమిత్రులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ప్రజలకు తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**-శ్రీ పరాభవనామ సంవత్సరంలో అందరికీ శుభం కలగాలి**

**-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్ కర్నూల్ : మార్చ్ 18ప్రజా జ్యోతి**

తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గురువారం జరుపుకోనున్న తెలుగు నూతన సంవత్సరాన్ని జిల్లా ప్రజలు ఆనందో త్సాహా లతో,సుఖసంతోషాలతో జరుపుకోవాలని అన్నారు. ఉగాది పచ్చడిలో ఉండే ఆరు రుచులు మన జీవితంలోని ఆరు భావాలను సూచిస్తాయనితీపి,చేదు,వగరు,పులుపు రుచుల సమ్మేళనమే ఉగాది పచ్చడి అని,మన జీవితం కూడా ఎన్నో అనుభవాల సమాహారమని తెలియజేస్తుందని,తెలుగు ప్రజలకు ఉగాదికి ప్రత్యేక ప్రాముఖ్యతఉందని శ్రీ పరాభవ నామ సంవత్సరంలో జిల్లా మరింత ప్రగతిని సాధించాలని,జిల్లా ప్రజలుసుఖసంతోషాలతో,ఆనందోత్సాహాలతో జీవనం సాగించాలని,ప్రతి ఒక్కరికీ శుభాలు కలగాలని, భోగభాగ్యాలతో ఆనందంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు

## గ్రామ పంచాయతీ కార్మికుల అరెస్టులపై మండల వ్యాప్తంగా నిరసనలు



**చిన్నంబావి, మార్చి 18 (ప్రజాజ్యోతి)**

గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టిన గ్రామపంచాయతీ కార్మికులను పోలీసులు నిర్బంధించి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ బుధవారం గ్రామాలు, మండలాల్లో నిరసనలు చేపట్టారు. చిన్నంబావి మండల కేంద్రంలోని కొప్పునూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సభ్యుడు అక్తర్ పాషా, మండల అధ్యక్షుడు వి. గోపాల్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రీన్ చానల్ ద్వారా ప్రతి నెల 5వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై నిర్బంధ చర్యలు తీసుకోవడం, హక్కుల కోసం పోరాడుతున్న వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అరెస్టులను ఎత్తివేసి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసనల్లో ఎస్. మసయ్య, వెంకటస్వామి, గోపాలు, ఈశ్వరమ్మ, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**షెడ్యూల్ కులాలకు 36 షాపింగ్ కాంప్లెక్స్ లు కేటాయింపు**

కల్వకుర్తి,మార్చ్ 18 (ప్రజా జ్యోతి):

పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. కల్వకుర్తి పట్టణలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కల్వకుర్తిలో పర్యటించి, నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పురోగతిపై ఇంజనీర్లు, సంబంధిత అధికారులతో సమీక్షించిన కలెక్టర్, ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

అదనపు వనరులను సమకూర్చుకుని పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యం చేరువవుతుందని ఆయన పేర్కొన్నారు. షెడ్యూల్ కులాలకు 36 షాపింగ్ కాంప్లెక్స్‌లకేటాయింపుఅనంతరం, మున్సిపాలిటీ పరిధిలో షెడ్యూల్డ్ కులాల (రాజ) కోసం కేటాయించిన 36 షాపింగ్ కాంప్లెక్స్‌లను కలెక్టర్ సందర్శించారు. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, అర్హులైన వారికి డ్రా విధానంలో ఈ షాపులను పారదర్శకంగా కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, వివిధ శాఖల అధికారులు మరియు ఇంజనీర్లు పాల్గొన్నారు.



## ఘనంగా ఉగాది వేడుకలు

**కృష్ణ: (ప్రజా జ్యోతి) మార్చ్/18/2026/**

కృష్ణ మండలంలోని ముడుమాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉగాది పర్వదినం సందర్భంగా ఈ రోజు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకలలో సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి, ఉగాది పచ్చడి సేవించి ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా ఉపాధ్యాయులు,విద్యార్థులు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శు భాకాంక్షలు తెలుసుకున్నారు..ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్, ఉపాధ్యాయులు భారతి,రవికుమార్, ఆస్మా నిషాత్,వాలంటీర్ శిరీష, సర్వీస్ పర్సన్స్ సోఫీ,శివమ్మ మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ,సురేఖ,నర్సమ్మ,హఫీజ మరియు గుడేబల్లూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి రామకృష్ణ తదితరులు.పాల్గొన్నారు.



# కొల్లాపూర్ అంటే జూపల్లి జూపల్లి అంటే అభివృద్ధి

## కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం

**కొల్లాపూర్ మార్చి 18 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ పట్టణం స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం వైస్ ఛైర్మన్ షేక్ రహీం పాషా మరియు మున్సిపల్ కౌన్సిలర్ల 10వ. వార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేష్ ,4వ. వార్డు కౌన్సిలర్ ఖాదర్ పాషా 16వ. వార్డు కౌన్సిలర్ పెబ్బేటి శేఖర్ ముదిరాజ్ , 19వ. వార్డు కౌన్సిలర్ కాటమోని లహరి వేణుగోపాల్ యాదవ్ 15వ. వార్డు కౌన్సిలర్ నరసింహ, 14వ. వార్డు కౌన్సిలర్ కర్నె శివ ,1వ. వార్డు కౌన్సిలర్ పసుల సుజాత సతీష్ ,2వ. వార్డు కౌన్సిలర్ బింగి జయ లక్ష్మీ మహేష్ తో కలిసి రాష్ట్ర ఎక్సైజ్ , పర్యాటక, సంస్కృతి, పురావస్తు శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజక వర్గం మరియు ఉమ్మడి పాలమూరు జిల్లానే కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్రం గర్వించదగ్గ గొప్ప నాయకులు మన ప్రియతమ నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావు.

కొల్లాపూర్ అంటేనే జూపల్లిజూపల్లి అంటేనే అభివృద్ధిజూపల్లి కృష్ణారావు ఆరు పర్యాలు కొల్లాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యేగా గెలిచి మారుమూల నల్లమల్ల అటవీ ప్రాంతమైన కొల్లాపూర్ ని విద్యా, వైద్య ,రోడ్డు, రవాణా, పోలీస్ స్టేషన్లో పీజీ కాలేజీలు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి నేడు రాష్ట్రం తో పాటుగా దేశం కొల్లాపూర్ వైపు చూస్తుందంటే దానికి కారణం మన ప్రియతమ నాయకులు జూపల్లి కృష్ణారావు.అభివృద్ధిని కాంక్షించే మంత్రి జూపల్లి కృష్ణారావు గారు మరోసారి కొల్లాపూర్ నీ అభివృద్ధి చేయాలంటూ 18.25 కోట్లు మంజూరు చేయడం , కొల్లాపూర్




పై తమ ప్రేమను మరో మారు చూపడం చాలా సంతోషంగా ఉందని అందుకు వారికి కొల్లాపూర్ ప్రజానీకం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు,ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు జూపల్లి సైన్యం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు భరోసా

## శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్



**కల్వకుర్తి, మార్చ్ 18( ప్రజా జ్యోతి):**

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాలకు భరోసాని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. బుధవారం కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామానికి చెందిన గౌడుగు కృష్ణయ్య కు 54 వేల రూపాయల సీఎం సహాయనిది చెక్కుని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల సహకార సంఘం డైరెక్టర్ గౌడుగు భానుచందర్, గౌడుగు ఆదర్శ్, మహేష్, ఉన్నారు.

# రంజాన్ మాసం శాంతి-సహనానికి ప్రతీక

## -రంజాన్ తోఫా పంపిణీలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ : మార్చ్ 18ప్రజా జ్యోతి

రంజాన్ మాసం శాంతి సహనానికి ప్రతీకగానిలుస్తుందని ఎమ్మెల్యే డా.రాజేష్ రెడ్డి అన్నారు.బుధవారం నియోజకవర్గ మైనార్టీలకు జిల్లా కేంద్రంలోని మహఫుజ్ బిన్ మహఫుజ్ మస్జీద్నిర్వహించిన ఈద్ కా తోఫా రంజాన్ గిఫ్ట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి పాల్గొని రంజాన్ తోఫాను పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డిమాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు అండగా ఉంటుందని ఏ సమస్య వచ్చినా తనకు తెలపాలని,ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించువాలన్నారు.అదేవిధంగా,మైనార్టీ సమాజ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముస్లిం మైనార్టీలకు విద్య,ఉపాధి,స్వయం ఉపాధి రంగాల్లో మరింత ప్రోత్సాహం అందించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. రంజాన్ మాసం శాంతి,సహనం,సోదర భావానికి ప్రతీకగా నిలుస్తుందని సమాజంలో సామరస్యాన్ని ఐక్యతను బలపరచాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు,మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్,కౌన్సిలర్స్ నిజాముద్దీన్, నజీమా,ఆసిఫా బేగం,కూచుకుళ్ల సింధు,ముస్లిం మత పెద్దలు,యువకులు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.



# పాలమూరు సీనియర్ కళాకారుని వైద్య ఖర్చులకు 80 వేల నగదు అందించిన ఎన్జీవోల యూనియన్

**నర్వ మార్చ్ 18 ప్రజా జ్యోతి**

పాలమూరు జిల్లా భూత్పూర్ గ్రామానికి చెందినసీనియర్ కళాకారుడు చెన్నకేశవులుకు వైద్య ఖర్చుల నిమిత్తం పాలమూరు ఎన్జీవోల యూనియన్ తరపున విశ్రాంత ఉద్యోగులు, కలిసి కళాకారుని వైద్య ఖర్చుల నిమిత్తం 80500 విరాళాలు బుధవారం మహబూబ్నగర్ లోని తెలంగాణ నాను గజిటెడ్ భవనంలో కళాకారులు దంపతులను శాలువాళ్ళతో సన్మానించి నగదును అందజేయడం జరిగిందని రెవెన్యూ విశ్రాంత అధికారులు తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

. పాలమూరు జిల్లా వాసి ఇతను గంటసాల గాయకుని పాటలు, పద్యాలను ఉద్యోగుల పదవీవిరమణ ప్రోగ్రాం లలో పాడి అందరిని అలరించే వాడు. ఇతను ఎస్సీ మాదిగ అనుబంధ కూలమైన బుడగ జంగం కు చెందిన నిరుపేద వ్యక్తి. ఇతను గత మూడేళ్లుగా అనారోగ్యం కు గురై దాదాపు రెండు లక్షల అప్పుల పాలై సహాయం కోసం ప్రయత్నించు చుండగా .ఇతను కళాపోషణ కల్గిన వ్యక్తి.కనుక తోచినంత సహాయం చేయాలని ఇటీవల కోరడంతో మానవతా దృక్పథంతో స్పందించిన రెవెన్యూ విశ్రాంత ఉద్యోగులు మరియు మాదిగ విశ్రాంత ఉద్యోగ మేధావుల సంఘం నుండి వారిని శాలువాలతో సన్మానించి

సహాయం చేయాలనీ జిల్లా అధ్యక్షులు శ్చెన్నకిష్టన్న, అసోసియేట్ అధ్యక్షులు సుంకసారి చంద్రశేఖర్ గార్లు ప్రయత్నం చేయగా జి రాజేందర్ రెడ్డి, పవన్



కుమార్, హరిసింగ్ మరియు ఇతర ఉద్యోగులం కలిసి సమకూర్చిన 80500/- లు నగదును మాజీ ఉద్యోగసంఘ నాయకులు జి రాజేందర్ రెడ్డి, ప్రభాకరచారీ మాజీ తహసీల్దార్ల చేతుల మీదుగా వారిని శాలువాలతో సన్మానించి నగదును అందచేయడం జరిగింది. అని తెలిపారు, ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి తోకల హన్మయ్య, ఎం రాజారత్నం, భగవంతు, జాజప్ప, బుచ్చన్న, కావాలి కృష్ణయ్య, బస్వంత్ లు తదితరులు పాల్గొన్నారు.



# రూ. 32 లక్షలు పలికిన మున్సిపాలిటీ తై బజార్ వేలం పాట

కల్వకుర్తి, మార్చి 18 ( ప్రజా జ్యోతి ) : కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంత, తైబజార్, పశువుల సంత, వధశాల, చికెన్, మటన్,చేపల వ్యర్థాల సేకరణకు వేలం పాట బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ షాన్ వాజ్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో తై బజార్ రూ. 32,01,000/- లకు కూన సతీష్ కుమార్ దక్కించుకున్నారు. వధశాల రూ. 1,50,500/- లకు దండోత్కర్ శివాజీ, చికెన్, మటన్, చేపల వ్యర్థాల సేకరణ రూ. 20,50,000/- లకు మల్లేష్ లు దక్కించుకున్నారు. పశువుల సంత వేలం పాటలో ఎవరు పాల్గొనకపోవడంతో పశువుల సంత వేలం పాట 24.03.2026 రోజు నిర్వహించాడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.ఈవేలం లో మేనేజర్, అసిస్టెంట్ ఇంజనీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఆదాయంసరే సౌకర్యాలు మాటేంటి...**

కల్వకుర్తి మున్సిపాలిటీలో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంతో వేలంపాటలో మున్సిపాలిటీకి భారీ ఆదాయం సమకూరునప్పటికీ నిర్వహణ మాత్రం సరిగా లేదని కనీస సౌకర్యాలు కల్పించడం లేదని పట్టణ ప్రజలతో పాటు మండల ప్రజలు అంటున్నారు. అంతేగాకుండా పట్టణ నడి ఒడ్డున ప్రతి ఆదివారం నడిరోడ్డుపై కూరగాయలు ఇతర వస్తువులు అమ్ముతున్నారని సాయంత్రం వేళ రోడ్డుపై వెళ్ళాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ పాలకవర్గం దీనిపై ప్రత్యేక చొరవ చూపి పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



## పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో పరభావ నామ సంవత్సరం ఉగాది

### ప్రిన్సిపల్ డాక్టర్ మార్కె పోలోనియా యాస్



**కొల్లాపూర్ మార్చి 18 ప్రజా జ్యోతి**

పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది ఉత్సాహం కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు పీజీ సెంటర్ కొల్లాపూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్ మాట్లాడుతూ పరాభవ నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా పరాభవ నామ సంవత్సరంలో 1966 సంవత్సరంలో కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం అప్పుడు విద్యారంగంలో అభివృద్ధి కరమైన మార్పులు వచ్చాయి అని హరిత విప్లవం వ్యవసాయ రంగంలో అభివృద్ధి కరమైన మార్పులు వచ్చాయని తెలియజేసినారు పరాభవ నామ సంవత్సరంలో పరాభావం ఎదురైనప్పటికీ కూడా పరాభవం జరిగినటువంటి అనుభవాలను పునాదులుగా ఏర్పరచుకొని నిర్మాణతకమైన అభివృద్ధి క్రమంలో ఉండాలని చెప్పినారు పాలమూరు విశ్వవిద్యాలయం ఎ. జ. జి ఎన్ శ్రీనివాస్ సార్, రిజిస్టర్ రమేష్ బాబు సార్, తెలుగు శాఖ అధ్యాపకులు వివిధ శాఖలకు సంబంధించిన అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : మార్చ్ 18ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ,వార్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పట్టణ ప్రజలకునిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని,ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల 4వ,వార్డ్ ప్రజలకు విద్యుత్ ఒత్తిడి తగ్గి మెరుగైన సరఫరా అందుతుందని అన్నారు. వార్డ్ ప్రజలు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమణ రావు,మునిసిపల్ ఛైర్మన్ తీగల సునేంద్ర,వైస్ ఛైర్మెన్ బాదం రమేష్,కౌన్సిలర్ వసంత సంతోష్



గౌడ్,కూచుకుళ్లనరసింహ రెడ్డి,ప్రజాప్రతినిధులు,అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన అన్నాసాగర్‌లో పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు





**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 18 (ప్రజా జ్యోతి)**

దామరగిద్ద మండలం అన్నాసాగర్ గ్రామంలో మూడు రోజులపాటు జరిగిన పోతురాజు స్వామి విగ్రహం, శివలింగం , నంది , రెండు బొడ్రాయి లు నూతన ప్రతిష్టాపన ఆలయాల ప్రారంభం మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ముగిశాయి.మహోత్సవాల్లో భాగంగా చండీ యాగం, జలాధివాసం, ధాన్యాధివాసం వంటి పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. గ్రామ దంపతులు యుగముగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీ శ్రీ సిద్ధలింగ మహాస్వామి మహాతపస్వి భక్తులకు ఆధ్యాత్మిక ఉపదేశం అందించి స్వామివారి మహిమను వివరించారు.గుడి నిర్మాణ కర్త అనంతయ్య గౌడ్ గారిని మరియు వారి కుటుంబ సభ్యులను సన్మానించి అభినందించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, స్వామివారి ప్రసాదాలను అందించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ మహోత్సవాలు అన్నాసాగర్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి.“భక్తి, ఐక్యతతో నిర్వహించిన ఈ మహోత్సవాలు గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చాయి” అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట వాసులు, కౌన్సిలర్ బండి రాజేశ్వరి కుటుంబ సభ్యులు శివరాం రెడ్డి, వారి మిత్రులు, శ్రీనివాసులు, వాటర్ షెడ్ మాజీ చైర్మన్, జయప్రకాష్ రెడ్డి మెన్స్ రైట్స్ అసోసియేషన్ ఫౌండర్ మోహన్ రాజ్, అలాగే అన్నాసాగర్ గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : మార్చ్ 18ప్రజా జ్యోతి**

టాగర్ కర్నూల్ మండలం వనపట్ల గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి వెంటనే స్పందించి జిల్లాఆసుపత్రికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పి,ఈ క్లిష్ట సమయంలో తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



## అరక్షిత బాలికలకు ఉగాది నూతన వస్త్రాల అందజేత



**నాగర్ కర్నూల్ : మార్చ్ 18 ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా దగ్గర గల శ్రీ జ్ఞానేశ్వర్ వాత్సల్య అరక్షిత బాలికల ఆశ్రమంలో ఉన్న20 మంది బాలికలకు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆకారపు కుమారస్వామి కుటుంబ సభ్యులు అందించిన నూతనవస్త్రాలను అరక్షిత బాలికలకు జిల్లా సంక్షేమ అధికారి కే.రాజేశ్వరి అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరక్షిత బాలికలను రక్షించి వారికి సేవ చేయడం ఎంతో పుణ్యకార్యమనిఅన్నారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు ఆకారపు విశ్వనాథం,కమిటీ సభ్యులు ఆకారపు శంకరయ్య,నరసింహస్వామి,రవికుమార్,నరహరి, బద్రీనాథ్,బాలస్వామి,సిబ్బంది వేణుగోపాల్ ఆశ్రమ వార్డెన్ కల్పన,బాలికలు పాల్గొన్నారు.

## జ్ఞానేశ్వర వాత్సల్య మందిరానికి నీటి ప్యూరిఫైయర్ అందజేత




**నాగర్ కర్నూల్ : మార్చ్ 18 ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూలు జిల్లా కేంద్రం కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీ జ్ఞానేశ్వర వాత్సల్య అరక్షిత బాలికల మందిరానికి నీటి ప్యూరిఫైయర్ ను లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేసారు.320ూా లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి ప్యూరిఫైయర్ ను ప్రారంభించి అరక్షిత బాలికల నీటి దాహార్తిని తీర్చుటకు,శ్రీ శైలం వెళ్తున్న శివ భక్తులకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు హకీమ్ విశ్వ ప్రసాద్,రాధాకృష్ణ,నరేందర్ రెడ్డి,సురేష్ కుమార్,పరమేశ్వర్ రెడ్డి,ఆశ్రమ వార్డెన్ కల్పన,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈవ్ టీజింగ్ కు పాల్పడుతున్న ముగ్గురు పోకిరిలు

### -రెడ్ హ్యాండ్ గా పట్టుకున్న షి టీమ్ పోలీసులు

**నాగర్ కర్నూల్ : మార్చ్ 18ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ లోబుధవారం ఈవ్ టీజింగ్ కు పాల్పడుతున్న ముగ్గురు పోకిరిలను షీ టీమ్ పోలీసులు రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు.ఈ సందర్భంగా ఎస్.ఐరజిత మాట్లాడుతూ పోకిరీలు అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆడపిల్లల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని మహిళా వేధింపులకు పాల్పడితే డయల్ 100/షిటీమ్ పోలీస్ 8712657676 కు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని షి టీమ్ ఎస్.ఐ రజిత తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ.ఎస్ఐరాజ్యలక్ష్మి కానిస్టేబుల్ వెంకటేష్ ఉన్నారు.



## వేసవికి ముందే చర్యలు చేపట్టాలి : నీరు--పారిశుధ్యంపై కలెక్టర్ ఆదేశాలు

**- పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్వాడీల్లో త్రాగునీరు--టాయిలెట్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు**

**మహబూబ్‌నగర్, మార్చి 18 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

జిల్లాలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, హాస్టళ్లు, ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో త్రాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.బుధవారం మిషన్ భగీరథ, వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్, విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా త్రాగునీరు--పారిశుధ్య కమిటీ సమావేశంలో కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. త్రాగునీటి సరఫరా, వర్షపు నీరు నిల్వ, టాయిలెట్ సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, పీహెచ్‌సీలలో విద్యా--వైద్య సేవలకు ప్రాధాన్యతనిస్తూ, వేసవిలో త్రాగునీటి కొరత, పారిశుధ్య లోపాలు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల్లో త్రాగునీరు, టాయిలెట్ సమస్యలపై అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారాలు సూచించారు.జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య, డ్రైనేజీ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు సూచించారు. ఈజీఎస్ ద్వారా మంజూరైన 139 టాయిలెట్లలో 58 నిర్మాణంలో ఉండగా, 3 పూర్తయ్యాయని తెలియగా, మిగతా పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలోని 1163 అంగన్వాడి కేంద్రాల్లో 44 చోట్ల త్రాగునీటి



సమస్య ఉన్నట్టు గుర్తించగా, మిషన్ భగీరథ అధికారులు వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద సిటిజన్ పోర్టల్ ద్వారా ఇందిరమ్మ ఇండ్లకు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించగా, 594 ఇళ్లలో 173కు మాత్రమే మంజూరు చేసినందున మిగిలిన వాటికి కూడా తక్షణమే ఆమోదం ఇవ్వాలని ఆదేశించారు. కమ్యూనిటీ సోక్‌పిట్ పనుల పురోగతిని కూడా సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలను సమన్వయం చేసుకుని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్‌కు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మిషన్ భగీరథ అధికారులు, జిల్లా విద్యాశాఖ, సంక్షేమ శాఖ, డీఆర్‌డీఓ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 2025-26 వార్షిక ఆర్థిక ప్రణాళిక ప్రకారం బ్యాంకర్లు పూర్తి లక్ష్యాలను సాధించాలి.

**జిల్లాలోని ప్రతి ఖాతాదారునికి ప్రధానమంత్రి జీవనజ్యోతి, బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కల్పించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలి.**

**స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే బ్యాంకు లింకేజీ రుణాలు వందశాతం లక్ష్యాలు పూర్తి చేయాలి.**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**

**వనపర్తి మార్చి 18 (ప్రజాజ్యోతి)**




ఈ ఆర్థిక సంవత్సరములో నిర్దేశించుకున్న 5339.27 కోట్ల వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా డిసెంబర్ నాటికి 3326.61 కోట్ల వార్షిక రుణం లక్ష్యంగా సాధించడం జరిగిందని, మార్చి 31 లోపు వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిసెంబర్, 2025 త్రైమాసిక జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపులు, సమన్వయ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వార్షిక ప్రణాళికల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతి పై అంశాల వారిగా క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో చాలా మంది కష్ట జీవులు, చిరుద్యోగులు ఉన్నారని, వారందరినీ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కల్పించేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంవత్సరానికి కేవలం 20 రూపాయాలు, 449 రూపాయలు చెల్లిస్తే సరిపోయే బీమా పాలసీకి ఇప్పటి వరకు కేవలం 72162 మంది ఖాతాదారులు మాత్రమే బీమా తీసుకున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు గ్రామీణ, పట్టణ ప్రాంతంలో కలిపి లక్షకు పైగా ఉంటారని, ఇంకా ఉద్యోగులు, శ్రమ జీవులు చాలా మంది బీమా చేయించుకోవడంలో దూరంగా ఉన్నారని తెలిపారు. వారందరికీ అవగాహన కల్పించి బీమా చేయించే బాధ్యతను బ్యాంకర్లు తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సూచించారు.

ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యోజన, పీఎం స్వనిధి, తదితర పథకాల ద్వారా బ్యాంకు రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారికి రుణం మంజూరు చేయడం అర్హత లేని వారి దరఖాస్తులు తిరస్కరించడం జరగాలి తప్ప నెలల తరబడి బ్యాంకర్లు తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని ఆదేశించారు.

విద్యార్థుల ఉన్నత చదువులకు ఇవ్వాల్సిన రుణాలు, గృహ నిర్మాణ రంగానికి చాలా తక్కువ మందికి రుణాలు ఇచ్చారని, జిల్లాలో విద్యా రంగానికి, గృహ నిర్మాణానికి రుణాలు ఇచ్చేందుకు చాలా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకోలేని నిరుపేదలకు సైతం కొంత బ్యాంకు రుణాలు అందిస్తే ప్రభుత్వం నుండి బిల్లులు వచ్చాక తిరిగి చెల్లించేందుకు ఆస్కారం ఉందన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునే వారికి గృహ రుణాలు ఉదారంగా మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరిగేందుకు కొత్తగా పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి ప్రధానమంత్రి ముద్రా యోజన, స్టాండప్ ఇండియా పథకాల కింద రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. రోజువారీ వ్యాపారాలు చేసుకునే చిన్న వ్యాపారులకు ప్రధానమంత్రి స్వనిధి కింద విరివిగా రుణాలు ఇవ్వాలని, పూచీకత్తు లేని ఈ రుణాలు 20 లక్షల నుండి కోటి రూపాయల వరకు ఇస్తుందని, ఈ పథకంపై అవగాహన కల్పించి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి సాధించేందుకు దోహదపడాలని బ్యాంకర్లను కోరారు. ఇటీవల గ్రామీణ స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణ ద్వారా 28 మంది నిరుద్యోగ యువతకు వన్ జి.పి., వన్ బి.సి సఖి శిక్షణ ద్వారా ధృవ పత్రాలు పొందారని వారికి వారి స్వంత గ్రామ పరిధిలో బ్యాంకు బ్యాంక్ కరస్పాండెంట్ (బి.సి) ఉద్యోగ ఉపాధి కల్పించాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ లకు, బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు బ్యాంకు రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బ్యాంకర్లను కోరారు.

ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్ బ్యాంకర్లకు, జిల్లా అధికారులకు సమన్వయ కర్తగా ఉంటూ బ్యాంకుల ద్వారా కేర్దేశించుకున్న లక్ష్యాలు, డిసెంబర్, 31 నాటికి సాధించిన లక్ష్యాలపై గణాంకాలతో వివరించారు.

రిజర్వు బ్యాంక్ ఎల్.డి.ఒ. చేతన్ గోరేకర్, నాబార్డ్ డిడియం మనోహర్ రెడ్డి యు.బి.ఐ. చీఫ్ మేనేజర్ ఆశిష్ రంజన్, పి డి ఆర్ డి ఓ ఉమాదేవి, బ్యాంక్ మేనేజర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది సందడి మొదలైంది... కొత్త సంవత్సరానికి స్వాగతం!






**కృష్ణ : (ప్రజా జ్యోతి) మార్చ్/ 18/ 2026**

కృష్ణ మండలం పరిధిలోని ఎంపీ పీస్ ఖాన్ దొడ్డి పాఠశాలలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.వేడుకలలో భాగంగా విద్యార్థులు ఉగాది ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రసంగాలు చేశారు. అలాగే పచ్చడి తయారీ, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు ఉగాది పండుగ యొక్క చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను వివరించి విద్యార్థుల్లో సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్, మాట్లాడుతూ, ఉగాది పండుగ మన సంప్రదాయాలను గుర్తు చేసే ముఖ్యమైన సందర్భమని, విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా భారతీయ సంస్కృతిని మరింతగా తెలుసుకోవచ్చని అన్నారు.

## ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉగాది సంబరాలు

**నాగర్ కర్నూల్ : మార్చ్ 18ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలోబుధవారం విద్యార్థులు పరాభవ సంవత్సర ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెలుగువారి నూతన సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని, అధ్యాపకుల సమక్షంలో ఉగాది వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించి ఉగాది సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా ప్రాంగణాన్ని అందంగా అలంకరించిసహజసిద్ధంగా ఉగాది పచ్చడి తయారు చేసి, పండుగ ప్రత్యేకతను చాటారు.ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేసి,సంప్రదాయ వేషధారణలో పాల్గొని ఉగాది పండుగను వైభవంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ మదన్ మోహన్,ఏవో మొహమ్మద్ ఇర్ఫాన్,అధ్యాపకులు అంజయ్య, వనిత,ఉమాదేవి,కోదండరాములు,రామకృష్ణ,దశరథం,ముజఫర్,రాఘవేందర్,నరేష్,శోభారాణి పాల్గొన్నారు.

